క్లుప్తంగా

దద్దాల నారాయణకు సన్మానం



దద్దాల నారాయణను సన్మానిస్తున్న బచ్చు వెంగళరావు గుప్తా, తదితరులు

కనిగిరిరూరల్: వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య యువత నాయకులు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణ యువత కమిటీపై చర్చించారు. అనంతరం దద్దాల నారాయణను ఘనంగా సన్మానించారు. పార్టీ ఆర్యవైశ్య యూత్ నాయకులు బచ్చు వెంగళరావు గుప్తా, మహేంద్ర, గంజికుంట సాయి పేరూరి, అనుదీప్, తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: శివారు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని కాశిరెడ్డి కాలనీ, కొండ కింద కాలనీ, బీసీ కాలనీ ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు విద్యుత్, నీరు, డ్రైనేజీ కాలువలు, తదితర సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చైర్మన గఫార్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నాగార్పమ్మ విగ్రహ ప్రతిష్ట



విశిష్ట అలంకరణలో నాగార్పమ్మ మూల విగ్రహమూర్తి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కంభంపాడులో గ్రామదేవత నాగార్పమ్మ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు గణపతి పూజ, పుణ్యాహావచనం, గణపతిహోమం, గాయత్రీహోమం నిర్వహించారు. వేదమంత్రాల నడుమ నాగార్పమ్మ విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



ప్రచారంలో సీపీఐ నాయకులు

కనిగిరిరూరల్: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కనిగిరిలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్‌లు మాట్లాడుతూ ఈనెల 20నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలకు పార్టీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ 100 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలులో మొట్ట మొదటి సారిగా మహాసభలు జరుగుతున్నట్లు చెప్పారు. సీపీఐ నాయకులు పందిటి మోహన్, గులాం హుస్సేన్, గుజ్జుల బాలిరెడ్డి, ఎస్‌కే మస్తాన్, ఎస్దాని, శివ, రామయ్య, పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శివకుమారి

సింగరాయకొండ: గంజాయి, మాదకద్రవ్యాల వాడకం వల్ల దుష్ఫలితాలు ఉంటాయని, వాటికి దూరంగా ఉండాలని ఒంగోలు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకట్ మత్స్యకారులకు సూచించారు. మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ దేవలం పల్లెపాలెం బకింగ్ హోమ్ కెనాల్ ఒడ్డున శనివారం మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ శివకుమారి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మద్యం అమ్మినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. అటువంటి మద్యం అమ్మకాలు జరుగుతుంటే సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యాధికారి షేక్ ఆయేషాబేగం, మత్స్యకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడివక్కడే బేళ్లు.. రైతులకు ఆగని కన్నీళ్లు..!

మందకొడిగా పొగాకు కొనుగోళ్లు

- ఐదు నెలల్లో కొనుగోలు చేసింది 4.8 మిలియన్ కేజీలు మాత్రమే
- రైతుల వద్ద ఇంకా సుమారు 5 మిలియన్ల కేజీల పొగాకు
- గత ఏడాది జూన్‌లోనే ముగిసిన వేలం
- కనిష్ట ధరలు దిగజారినా కొనుగోళ్లు అంతంతమాత్రమే
- లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయని వ్యాపారులు



పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న బోర్డు అధికారులు



కనిగిరి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు



రైతుల ఇళ్లల్లో పొగాకు బేళ్లు

కనిగిరిరూరల్:

ఒకటి..రెండు..మూడు ఇలా ఐదు నెలలు గడిచిపోయాయి. మొదట్లో ధరల కోసం పోరాడితే..తరువాత అసలు కొనుగోలు చేస్తే చాలు అన్నట్లు తయారైంది. ఇది జిల్లాలో పొగాకు రైతులు దీన స్థితి. వేలం ముగింపు దశకు చేరుకున్నా ఇప్పటి వరకు రైతుల వద్ద సగం పొగాకు కూడా కొనుగోలు చేయలేదు. ఈ పరిస్థితుల్లో ఈ వారంలోనే వేలం ముగిసే అవకాశం ఉందంటున్నారు. మరీ రైతుల వద్ద మిగిలిపోయిన పొగాకు పరిస్థితి ఏంటనే దానిపై సందిగ్ధత కొనసాగుతోంది.

8.5 మిలికేజీల ఉత్పత్తి..

కనిగిరి పొగాకు బోర్డు పరిధిలో పొగాకు సాగు విస్తీర్ణం 4,952 హెక్టార్లు ఉండగా.. 5 క్లస్టర్ల పరిధిలో 74 గ్రామాల్లో 1,245 బ్యార్న్‌లు ఉన్నాయి. ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి 8.5 మిలియన్ కేజీలు ఉత్పత్తి దిగుబడి వచ్చింది. ఈ ఏడాది మార్చి 19 పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కాగా ఇప్పటి వరకు 13 రౌండ్లలో 4.82 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు కేవలం గ్రేడ్ పొగాకును మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. లోగ్రేడ్ పొగాకు ఇంత వరకు కొనుగోళ్లు చేయలేదు. నిత్యం బేళ్లు తీసురావడం, అందులో సగం బేళ్లను వ్యాపారులు తిరస్కరించడంతో రైతులు ఉసూరుమంటూ తీసుకువెళ్లడం పరిపాటిగా మారింది. గత ఏడాది జూన్ నెలాఖరు లోపే వేలం ముగిసింది. కానీ ఈ ఏడాది ఆగస్టు వచ్చి 10 రోజులైనా ఇంత వరకు సగం పొగాకు కూడా కొనుగోలు చేయలేదు. మరో వారంరోజుల్లో వేలం ముగిస్తామని అధికారులు చెబుతుండటంతో మిగిలిని పొగాకు ఏం చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గతంలో ఇలా..

గత ఏడాది 2023-2024లో కనిగిరి పొగాకు బోర్డు పరిధిలో 7.58 మిలియన్ కేజీల ఉత్పత్తి దిగుబడి వచ్చింది. దాదాపు రైతు దగ్గర ఉన్న పొగాకు మొత్తాన్ని బోర్డు అధికారులు, ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత ప్రభుత్వంలో గరిష్ట ధర కేజీ రూ.350 నుంచి రూ.360 వరకు, కనిష్ట ధర రూ.280 నుంచి రూ.270 వరకు కొనుగోలు చేశారు. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. ఈ ఏడాది గరిష్ట ధర రూ.280 మాత్రమే పలికింది.

ఎన్నిసార్లు రోడ్డెక్కినా..

గిట్టుబాటు ధర కల్పించాలని, కనీసం పండించి పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని, కనిష్ట ధర తగ్గించినా.. లోగ్రేడ్‌లోని అన్ని రకాల బేళ్లను కొనుగోలు చేయాలనీ, పెరిగిన ధరలకు అనుగుణంగా మద్దతు ధర ఇవ్వాలనీ, బయ్యర్లతో మాట్లాడి రైతుకు న్యాయం చేయాలనీ, మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతులు ఎన్నో సార్లు రోడ్డెక్కారు. ధర్నాలు చేశారు. అయినా కూటమి ప్రభుత్వంలో చలనం లేదు. ఫలితంగా పొగాకు రైతుల ఇళ్లల్లో బేళ్ల గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయి. ఆరు కాలం కష్టించి.. శ్రమటోర్చి.. పెట్టుబడికి అప్పులు తెచ్చి పండించిన పంట కళ్ల ముందే కదలకున్న పరిస్థితి దాపురించడంతో కూటమి సర్కార్ పాలనపై పొగాకు శాపనార్థాలు పెడుతూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

కనిష్ట ధర దిగజారినా..

బోర్డు ప్రారంభంలో కేజీ పొగాకు కనిష్ట ధర రూ.180 వరకు పలికినా.. ప్రస్తుతం రోజులగా కనిష్ట ధర రూ.150కి పడిపోయింది. గత ప్రభుత్వంలో పొగాకు కొనుగోలు చివరి దశ వరకు కూడా కనిష్ట రూ. 250 నుంచి 280 వరకు ఇచ్చారు. ప్రస్తుత కూటమి సర్కార్‌లో పొగాకు ధర పూర్తిగా దిగజారిన కూడా.. లోగ్రేడ్‌లోని అన్ని రకాల పొగాకు బేళ్లను కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

ఇంకా 3.2 మిలియన్ కేజీలు మిగిలే పరిస్థితి..

నియోజకవర్గంలో పొగాకు రైతులు ఈ ఏడాది 8.5 మిలియన్‌కేజీలు ఉత్పత్తి చేయగా ఇప్పటికి 4.82 మిలియన్ కేజీలు కొనుగోలు చేశారు. మరో వారంలో వరకు వేలం జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అనుమతి కొనుగోళ్ల ప్రకారం 5.3 మిలియన్ కేజీల వరకు కొనుగోలు చేస్తారు. అంత వరకు అధికారులు కొనుగోలు చేసినా.. రైతుల ఇళ్లలో ఇంకా 3.2 మిలియన్ కేజీల పొగాకు బేళ్ల నిల్వ ఉంటాయి. వాటిలో గ్రేడ్1, మిడియం రకంతో పాటు, లోగ్రేడ్ రకం కూడా ఉంటుంది.

> **అనుమతి మేరకే కొనుగోళ్లు**
>
> ఇప్పటి వరకు 4.82 మిలియన్ కేజీల పొగాకు బేళ్లను కొనుగోలు చేశాం. మరో వారం రోజులు వరకు వేలం నిర్వహించే అవకాశం ఉంది. బోర్డు అనుమతి ఇచ్చిన దాని ప్రకారం 5.3 మిలియన్ కేజీల వరకు కొనుగోలు చేస్తాం . గడువు పెంపుకు అనుమతి ఇస్తే.. వేలం కొనసాగిస్తాం.నియోజకవర్గంలో పొగాకు ఉత్పత్తి 8.5 మిలియన్ కేజీవరకు వచ్చింది వాస్తవమే.
>
> – కోటేశ్వరరావు, వేలం సూపరింటెండెంట్

బస్టాండ్‌లో కనీస వసతులు కరువు



బస్టాండ్‌లో కుర్చీలు లేకపోవడంతో కింద కూర్చొని ఉన్న ప్రయాణికులు

కొండపి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు కూడా సరిపడినన్నీ లేవంటున్నారు. శనివారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో పదిమంది ప్రయాణికులు కూర్చుంటే మిగిలిన ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తూ కింద కూర్చున్నారు. కొంతమంది ప్రయాణికులు నిల్చొని బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో దాహార్తి తీర్చుకునేందుకు మంచినీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీకి ఆదాయం దుకాణాల రూపంలో ఎక్కువగా వస్తున్న ప్రయాణికులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో సాక్షిలో ×ఆదాయం ఘనం వసతులు శూన్యం₹ శీర్షిక వెలువడింది. ఆ కథనానికి స్పందించిన అధికారులు 8 కుర్చీలను ఏర్పాటు చేశారు.పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న రోజులలో బస్టాండ్‌కు తాకిడి ఎక్కువగా ఉంటుందని ఆ సమయంలో ఇంకా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం, కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దద్దాలకు రాఖీ కట్టిన మహిళలు



దద్దాల నారాయణకు రాఖీ కడుతున్న మహిళలు

కనిగిరిరూరల్: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు... ప్రేమానుబంధాలకు, ఆత్మీయ అనురాగాలకు ప్రతీకగా నిర్వహించుకునే రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చెల్లెళ్లు అన్నలకు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. అన్నలు, తమ్ముళ్లు చెల్లెళ్లు, అక్కలకు స్వీట్లు తినిపించి ఆశీర్వాదం పొందారు.

వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌కు అక్కా చెల్లెళ్లు, పార్టీ మహిళా నేతలు రాఖీలు కట్టారు. రాఖీ పౌర్ణమి పండుగ శుభాకాంక్షలు తెలిపి, స్వీట్లు తినిపించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో దద్దాల మాలకొండమ్మ, దద్దాల వరలక్ష్మి దద్దాల వరకుమారి, దద్దాల శ్రీదేవి, దద్దాల శ్రీలేఖ, వేల్పుల మాధవి, వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం నియోజకవర్గ నాయకులు అలుముల నాగమణి, మద్దిశెట్టి భారతి, సుస్మితా, ఎస్‌కే షకీలా, గాయకవాడ సుహాసిని, ఓరుగంటి పద్మ, పందిటి వెంకటలక్ష్మీ, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి తదితరులున్నారు.

వైభవంగా ప్రతిష్టా మహోత్సవం



పోలేరమ్మతల్లి మూలవిరాజ్



భక్తులతో కిక్కిరిసిన ఆలయం

మద్దిపూడి: మండలంలోని కూచిపూడి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ దేవస్థానంలో విగ్రహప్రతిష్టా మహోత్సం శనివారం అంగరంగా వైభవంగా సాగింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు వై వెంకట రమణ అమ్మవారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆగమపండితులు, ప్రతాష్టాచార్యులు గూడలి వెంకటకృష్ణ చైతన్యశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విష్వేశ్వర పూజ, పున్యాహవచనం, దాతున్యాసం, శిఖర, యంత్ర, బింబి, ప్రాణ ప్రతిష్టా, కుంభాభిశేఖం, పూర్ణాహుతి, ఆలయ మహానివేదన, దీక్షావిరమణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ముందుగా జలిధిలో ఉన్న అమ్మవారి ప్రతిమలను వేద మంత్రోచ్ఛరణ, ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించి, అనంతరం శాస్త్రోత్తంగా ప్రతిష్టించారు. ప్రతిష్టా మహోత్సవాన్ని తిలకించేందుకు జువ్విగుంట, పొదిలి, మద్దిపూడి, చెంచిరెడ్డిపల్లి, గంగపాలెం, గుండ్లసముద్రం, రేగలగడ్డ, వేమవరం తదితర గ్రామాలతో కొండపి, జరుగుమల్లి, సింగరాయకొండ, ఒంగోలు తదిత ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రమాదం వెనుక మరో ప్రమాదం..

ఉలవపాడు: చాగల్లు వద్ద తుఫాన్ వాహనం ట్రాలీని ఢీ కొన్న సమయంలో వెనుక ట్రాఫిక్ నిలిచిపోయింది. శుక్ర వారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగిన సమయంలోనే వెనుక ట్రాఫిక్ ఆగే సమయంలో మూడు వాహనాలు ఢీ కొన్నాయి. నెల్లూరు వైపు వెళ్తున్న కారు ఆగి ఉన్న సమయంలో వెనుకనే వచ్చిన తుఫాన్ వాహనం కారును ఢీ కొట్టింది. కారు వెనుక భాగం దెబ్బతినింది. వెనుకనే ఉన్న ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి తిరుపతి వెళుతూ తూఫాన్ వాహనాన్ని ఢీ కొట్టింది. తుఫాన్ వాహనం వెనుక భాగం దెబ్బతినింది. బస్సు అద్దం పగిలిపోయింది. మూడు వాహనాలను రోడ్ సేఫ్టీ సిబ్బంది పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ జైలుద్దీన్

పీసీపల్లి: రైతులు పంట మార్పిడి, విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి వంటి పద్ధతులు ఉపయోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ జైలుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని పెదఅలవపాడు రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. పొలంలో మిత్ర పురుగులను గుర్తించి వాటికి నష్టం కలగకుండా చూడాలన్నారు. రైతులు వివిధ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఏఓ రంగకృష్ణ, పువ్వాడ మల్లికార్జున, శ్రీనివాసులు, నాగరాజు, శ్రీరాములు, వెంకటసుబ్బయ్య, సుబ్బారావు పాల్గొన్నారు

భూముల వేలం ఆదాయం రూ.1.54 లక్షలు



భూముల వేలం నిర్వహిస్తున్న అధికారులు

సింగరాయకొండ: పాతసింగరాయకొండ వరాహాలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో శనివారం జరిగిన భూముల వేలంలో రూ.1.54 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కృష్ణవేణి తెలిపారు. ఆలయానికి చెందిన కందుకూరు, ఉలవపాడు మండలం రాజుపాలెం, మూలగుంటపాడు, పాతసింగరాయకొండ లోని 28.79 ఎకరాలకు వేలం జరిగిందన్నారు. గత ఏడాది 66,200 రూపాయలు ఆదాయం రాగా ఈ సంవత్సరం అదనంగా రూ.88,500 వచ్చినట్లు పేర్కొన్నారు. వేలంలో అన్యమతస్తులు వేలంలో పాల్గొనేందుకు వచ్చారని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారు పాల్గొనేందుకు నిబంధనలు ఒప్పుకోలేదన్నారు. గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



శ్రీవెంకటేశ్వర కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలంవారిపల్లెలో శ్రావణమాసం శ్రవణానక్షత్రం వెంకటేశ్వరస్వామి జన్మదిన నక్షత్రం సందర్భంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి మూల విగ్రహమూర్తులకు శాస్త్రోక్తంగా అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వరుని ఉత్సవమూర్తులకు అభిషేకం చేసి కల్యాణవేదికపైకి చేర్చి వేదమంత్రాల నడుమ శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు సమాచార హక్కు చట్టంపై శిక్షణ

సీఎస్‌పురం(పామూరు): సమాచార హక్కు చట్టంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11న శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణాకు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరు కావాలని కోరారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీలు గాయ బలరామిరెడ్డి దంపతులు



హెచ్‌ఎంపాడులో గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని గంగమ్మ గుడిలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నిర్మించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సంవత్సన వేడుకలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ కిచ్చంపల్లి వద్ద వెలసిన నిదానంపాటి అమ్మవారికి శనివారం ప్రత్యేక కొలుపులు పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో వచ్చిన భక్తులు నిదానంపాటి అమ్మకొలుపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గాయం బలరామిరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం ఈశ్వర్మమ్మలు అమ్మవారి కొలుపుల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గాంధీజీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కనిగిరిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే ఖాశింపీరా, ఎస్‌కే ఖాదర్‌వలి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్క్‌ర్స్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నిరసన నిర్వహించారు. అనంతరం ఆలూరి కోటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. ప్రభుత్వం మున్సిపల్, పారిశుధ్య కార్మికులకు ఇచ్చి వాగ్దానాలను అమలు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఇంజినీరింగ్ కార్మికులు స్కిల్డ్, సెమి స్కిల్డ్, హైస్కిల్డ్ గా విభజించి జీతాలు చెల్లించాలని, కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో నమోదు చేసి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతనం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గాంధీజీ విగ్రహనికి అందచేశారు. యూనియన్ నాయకులు నాసర్, కిరణ్, శేషయ్య, మస్తాన్, రవి, శేఖర్, జీవన్, మధు, రత్తయ్య, ఏసుబాబు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

239 పొగాకు బేళ్లు తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 239 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఇన్‌చార్జి వేలం నిర్వహణాధికారి ఎం.సత్య శ్రీనివాస్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పైడిపాడు, గోగినేనివారిపాలెం, అక్కచెరువుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1069 బేళ్లను వేలానికి తీసుకురాగా 830 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.140, సరాసరి ధర రూ.217.67గా నమోదైంది. వేలంలో 25 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 258 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చిరికూరపాడు, పీపీపాలెం గ్రామాలకు చెందిన రైతులు 926 బేళ్లను తీసుకురాగా 668 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.150, సరాసరి ధర రూ.229.84గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.